ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 27 సెప్టెంబరు 2024



మీ ఇంట్లో
ఇలాగే వండుకుని తింటారా?
జేఎన్టీయూ వంట గదిలో అపరిశుభ్రతపై ఆర్డీవో ఆగ్రహం
బాలికల వసతి గృహం వంట శాలలో ఆకస్మిక తనిఖీలు
సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని ఎమ్మార్వోకు ఆదేశం
అందుబాటులో లేని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ 7

ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు..

ఆపరేటర్ డిస్మిస్, అధికారుల సస్పెన్షన్

ఝరాసంగం, సెప్టెంబరు 26: మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామంలో ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లను కేటాయించిన వ్యవహారంలో బాధ్యులైనవారిపై కలెక్టర్ కొరడా ఝళిపించారు. ఒకరిని విధుల నుంచి తొలగించగా.. ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు. రెండు నెలల క్రితం మాచ్నూర్ గ్రామంలో కొంతమందికి సంబంధించిన ఇంటి నంబర్లను ఇతరుల పేరిట నమోదు చేయడం, ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించడంపై గ్రామస్థులు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీవో అమృత గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు. ఆరోపణలు నిజమేనని తేలడంతో ఈమేరకు నివేదికను అందజేశారు. పరిశీలించిన కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎంపీఈవో లక్ష్మయ్యను సస్పెండ్ చేయడంతో పాటు డాటాఎంట్రీ ఆపరేటర్ మహిపాల్‌రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు.

పుల్కల్, చౌటకూర్.. చెరువులకు మహర్దశ

- 48 చెరువులకు రూ. 10.18 కోట్లు మంజూరు
- పెరగనున్న 3,741 ఎకరాల సాగు విస్తీర్ణం

పుల్‌కల్, సెప్టెంబరు 26: సంగారెడ్డి జిల్లా పుల్కల్, చౌటకూర్ మండలాల్లో చెరువులకు మరమ్మతుల చేపట్టి మరింత భూమిని సాగులోకి తీసుకువచ్చేందుకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనరసింహ నిధులు మంజూరు చేయించారు. రెండు మండలాల్లో 48 చెరువులను పునరుద్ధరించేందుకు రూ.10.18 కోట్లు విడుదల చేస్తూ నీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. సింగూరు ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి పుల్కల్, చౌటకూర్ మండలాల్లో 35,500 ఎకరాలకు సింగూరు జలాలను అందిస్తున్నారు. ఇందులో కాలువల ద్వారా 26 వేల ఎకరాలు, చెరువులు, కుంటల కింద 9,500 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతున్నది. పుల్కల్ మండలంలోని 1,672 ఎకరాలకు సాగు నీరందించే 23 చెరువుల పునరుద్ధరణకు రూ.4.96 కోట్లు, చౌటకూర్ మండలంలో 2,069 ఎకరాలకు సాగు నీరందించే 25 చెరువులకు రూ.5.22 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలన అనుమతులను జారీ చేసింది. దీంతో పుల్కల్, చౌటకూర్ మండలాల్లో అదనంగా 3,741 ఎకరాల అదనపు ఆయకట్టు భూమి సాగులోకి రానుండటంతో పాత, కొత్త ఆయకట్టు కలిపి మొత్తం 39,241 వేల ఎకరాలు స్థిరీకరించబడనుంది. అదనపు ఆయకట్టును సాగులోకి తీసుకువచ్చేందుకు చొరవచూపిన మంత్రికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



వైద్య విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

సంగారెడ్డి మెడికల్ కాలేజీలో మూడో బ్యాచ్

- ఆల్ ఇండియా కోటాలో 20 మంది అడ్మిషన్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మూడో బ్యాచ్ విద్యార్థుల చేరికలు ప్రారంభమయ్యాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆల్ ఇండియా కోటా కింద 22 సీట్లకు గాను గురువారం నాటికి 20 మంది వైద్య విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఆల్ ఇండియా కోటా కింద కేటాయించిన మెడికోలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలను ప్రిన్సిపాల్ డా.సుధామాధురి క్షుణంగా పరిశీలించి అడ్మిషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తిచేయండి

- వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 26 : డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి పంపిణీకి సిద్ధం చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల పనులను పూర్తిచేసేందుకు కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు హౌసింగ్ ఎండీకి పంపించాలని జిల్లా గృహనిర్మాణశాఖ మేనేజర్ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ శాఖాధికారులకు సూచించారు. అంగన్‌వాడీ భవనాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు. మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా క్యాంటిన్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మునిపల్లి మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, రైతు వేదికల వద్ద ఉపాధిహామీ పథకంలో సీసీరోడ్లు వేయించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ జగదీష్ జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారిణి జ్యోతి, మెప్మా పీడీ గీత, డీఈవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మంత్రి కొండాసురేఖ, పక్కన ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, సునీతారెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ రాహుల్‌రాజ్

సమాచారం లేకుండానే సమీక్షకు వస్తారా!!

- 'వనమహోత్సవం'పై నిర్లక్ష్యం తగదు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో విచ్చలవిడి సిజేరియన్లు నిరోధించాలి
- ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి
- అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగేలా చర్యలు
- మెదక్ జిల్లా అభివృద్ధి సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ

మెదక్, సెప్టెంబరు 26: జిల్లా అభివృద్ధిపై నిర్వహిస్తున్న సమీక్షా సమావేశానికి సమగ్ర సమాచారం లేకుండానే ఎలా వస్తారని అధికారులపై ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా అభివృద్ధిపై వివిధశాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు రోహిత్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆమె మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వానాకాలం సీజన్ మించిపోతున్నా ఇప్పటివరకు లక్ష్యంలో 30 శాతం మొక్కలు మాత్రమే నాటడం ఏమిటని మండిపడ్డారు. అవెన్యూ ప్లాంటేషన్, అర్బన్ ప్రాంతాలు, ఆలయాలు, పార్కులు, విద్యా సంస్థల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. సమీక్షలో పాల్గొన్న అధికారులు హరితనిధి వివరాలు ఇవ్వలేదని, ఆ వివరాలను తనకు వెంటనే పంపించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆదేశించారు. ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, అటవీ శాఖ అధికారి జోజో మాట్లాడుతూ 15 రోజుల వ్యవధిలో మొక్కలు నాటడం పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ తీగల కింద మొక్కలు నాటవద్దని సూచించారు. ఎంపీ రఘునందన్ మాట్లాడుతూ నర్సాపూర్ అడవిలో వన్యప్రాణులు, కోతులకు ఆహారాన్నిచ్చే మొక్కలు నాటాలని పేర్కొన్నారు.



సమీక్షకు హాజరైన అధికారులు

ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయండి

జిల్లాలో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతుంటే ఏం చర్యలు తీసుకుంటున్నారని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం, ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ శివదయాల్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 48 శాతం, ప్రైవేటు ఆస్పత్రుల్లో 52 శాతం సిజేరియన్లు జరగడమేమిటని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆస్పత్రులను క్రమంతప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 58 హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణాలను పూర్తిచేయడానికి నిధుల కోసం పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చూడాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు.

వడ్ల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండం

వానాకాల వరి కోతలు దగ్గరపడుతున్నందున ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని సివిల్‌సప్లయ్ డీఎం హరికృష్ణను మంత్రి ఆదేశించారు. జిల్లా తూనికల అధికారి సమావేశానికి హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం తూకంలో మోసాలను అరికట్టాలని ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ఖర్చులు వసూళ్లు చేయకుండా చూడాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని ప్రవేటు కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ కోఆపరేటీవ్ సొసైటీల్లో అవినీతిపై ఏం చర్యలు తీసుకుంటున్నారని డీసీవో కరుణను ప్రశ్నించారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ ఏడుపాయల జాతర నిర్వహణకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఇప్పించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

త్యాగధనుల చరిత్రే తెలంగాణ

మెదక్ అర్బన్, సెప్టెంబరు 26: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ఐలమ్మ చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. తెలంగాణ చరిత్ర మొత్తం త్యాగధనులు, అమరుల చరిత్రనే అని, వారి స్ఫూర్తితోనే తెలంగాణకు ప్రశ్నించేతత్వం అలవడిందన్నారు. నిరంకుశ పాలనకు, జమీందార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి ఐలమ్మ అని కొనిడాయారు. మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ రఘునందన్‌రావు, మెదక్, నర్సాపూర్ ఎమ్మెల్యేలు రోహిత్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేఖ

- అంతకుముందు మంత్రి కలెక్టరేట్‌కు వస్తున్న సమయంలో చేతిలో పసిబిడ్డతో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ శ్రీలతను చూసి కాన్వాయ్ ఆపారు. ఎండగా ఉండడంతో బాబుకు నీళ్లు తాగించి, తల్లీబిడ్డలను తనతోపాటు కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. పోలీసు ఉన్నతాధికారులకు కానిస్టేబుల్ పరిస్థితిని వివరించి మరోచోట విధులు వేయాలని సూచించారు.



చిన్నారికి నీళ్లు తాగిస్తున్న మంత్రి కొండాసురేఖ

టేక్మాల్ సొసైటీ చైర్మన్‌పై దాడి

- డైరెక్టర్, రైతు, చైర్మన్‌ల మధ్య వాగ్వాదం
- పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

టేక్మాల్, సెప్టెంబరు 26: మెదక్ జిల్లా టేక్మాల్ సహకార సంఘం చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై పలువురు డైరెక్టర్లు దాడి చేశారు. జిల్లా సహకార సంఘం అధికారి ఆదేశాల మేరకు గురువారం సొసైటీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే, గత సీఈవో వేణుగోపాల్ అవినితికి పాల్పడడంతో అధికారులు అతనిని సస్పెండ్ చేశారు. వేణుగోపాల్ స్థానంలో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌ను నియమిస్తూ జిల్లా సొసైటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో అవినీతికి పాల్పడిన సీఈవో వేణుగోపాల్‌కు తిరిగి సొసైటీలో ఎలాంటి బాధ్యతలు అప్పగించవద్దని డైరెక్టర్లు తీర్మానం చేసే క్రమంలో చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, డైరెక్టర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.



గాయపడిన చైర్మన్ యశ్వంత్‌రెడ్డి

దీంతో ఇరువర్గాల మధ్య పెద్దఎత్తున గొడవ జరిగింది. ఈ గొడవలో యశ్వంత్‌రెడ్డికి గాయాలు అయ్యాయి. మండల పరిధిలోని పల్వంచ గ్రామానికి చెందిన ఓ రైతు తనకు సంబంధించిన లోన్ విషయంలో తనకు అన్యాయం జరిగిందని చైర్మన్ యశ్వంత్‌రెడ్డిని ప్రశ్నించాడు. దీంతో రైతును చైర్మన్ ఇష్టం వచ్చినట్లుగా దుర్భాషలాడడంతో మనస్తాపానికి గురైన రైతు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చైర్మన్ యశ్వంత్ రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. చైర్మన్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు డైరెక్టర్లు దాడులు చేస్తున్నారని చైర్మన్ పేర్కొన్నాడు. తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, అవినీతి చేసినట్లు ఉంటే రైతుల సమక్షంలో బయట పెట్టాలని, తనపై అన్యాయంగా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



ఏడుపాయల ఆలయం ఎదుట మంజీరా ఉధృతి

జలదిగ్బంధంలోనే వనదుర్గ ఆలయం

పాపన్నపేట, సెప్టెంబరు 26: సింగూరు ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం మూడు రోజులుగా జలదిగ్బంధంలోనే కొనసాగుతోంది. గురువారం సైతం వరద ఉధృతి కొనసాగడంతో తెల్లవారుజామున అర్చకులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. భక్తుల దర్శనం కోసం అమ్మవారి ఉత్సవవిగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి నిత్యపూజలు కొనసాగించారు. వనదుర్గా ప్రాజెక్ట్ నుంచి 15,000 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తుండడంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అటవీ ఆహ్లాదంతో ఇంపు..
మహానగర చెత్త వేస్తే కంపు
అటవీ ప్రాంతం సమీపంలో ప్యారానగర్ వద్ద డంపుయార్డు
- ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటుకు ప్రయత్నం
- అడ్డుకుంటున్న స్థానికులు
- తాజా పరిణామాలతో చుట్టుపక్కల గ్రామాల్లో అలజడి
7





మనోహరాబాద్ శివారులోని రామాయపల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో నీట మునిగిన ప్లాట్లు

చెరువును తొలిచి.. ప్లాట్లు చేసి..!

- ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్
- ప్లాట్లు చేసి.. రోడ్లు వేసి విక్రయం
- పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదులు వచ్చినా చర్యలు శూన్యం

మనోహరాబాద్, సెప్టెంబరు 26: ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లు, భవన నిర్మాణాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలకేంద్రం శివారులో రామాయపల్లి పెద్దచెరువులో ఓ వెంచర్ యజమానులు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్లు చేసి విక్రయిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మనోహరాబాద్ శివారులో 69 ఎకరాల్లో రామాయపల్లి పెద్ద చెరువు విస్తరించి ఉన్నది. 15 సంవత్సరాల క్రితం కొంతమంది రియల్టర్లు చెరువును ఆనుకుని 30 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేశారు. సర్వే నెంబర్లు 206, 106, 89, 107, 104, 100, 99, 91, 92, 93, 101, 76, 72, 73, 96, 109, 102, 98, 90, 75, 86, 87, 97, 103, 70, 88, 77లో మొత్తం 475 ప్లాట్లను ఏర్పాటు చేశారు. గజం రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ప్లాట్లను విక్రయిస్తున్నారు. ఈ వెంచర్‌లో ఎనిమిది ఎకరాల మేర ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్లాట్ నంబర్ 54 నుంచి 233 ప్లాట్ నంబర్ వరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్లాట్లు ప్రస్తుతం చెరువు నీటిలోనే ఉన్నాయి.

అనుమతులు లేకుండానే!

ఈ వెంచర్‌కు గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నారా.. లేదా అన్న విషయంపై ఆంధ్రజ్యోతి గతంలో పనిచేసిన కార్యదర్శులను వివరణ కోరగా.. తమకు గుర్తు లేదని చెప్పడం గమనార్హం. ఈ వెంచర్‌కు ఇరిగేషన్ శాఖ నుంచి ఎటువంటి అనుమతి లేదని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. చెరువు పరిధిలో ప్లాట్లు చేయడంపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ వెంచర్లు అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇదే విషయంపై ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు, రైతులు ఆరోపిస్తున్నారు.

అధికారుల చర్యలు శూన్యం



మండల కేంద్రంలోని చెరువుల్లో అక్రమ కట్టడాలు, ఎఫ్‌టీఎల్ భూమిలో వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మనోహరాబాద్‌లోని వెంచర్‌లో ప్రస్తుతం కొన్ని ప్లాట్లు పూర్తిగా నీటితో నిండి ఉన్నాయి. ఈ విషయమై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆక్రమణలు తొలగించి చెరువులను కాపాడాలి.

\- పోలీస్ వెంకట్‌రెడ్డి, మనోహరాబాద్

ఎలాంటి అనుమతి ఇవ్వలేదు




మండలంలో చెరువుల్లో, కుంటల్లో వెంచర్లకు, అక్రమ కట్టడాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. గతంలో చెరువుల్లో అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు తీసుకున్నాం. ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్ ఏర్పాటు చేసినట్టు తేలితే చర్యలు చర్యలు తీసుకుంటాం.

\- శ్రీకాంత్, తూప్రాన్ ఇరిగేషన్ అధికారి

రెండేళ్ల క్రితమే ఇక్కడికి వచ్చాను

రెండు సంవత్సరాల నుంచి మనోహరాబాద్ గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్నాను. 2019లో మనోహరాబాద్ పరిధి నుంచి విడిపోయి దండుపల్లి ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. ప్రస్తుతం వెంచర్ దండుపల్లి పరిధిలోకి వస్తుంది. 2010-11లో వెంచర్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉన్న కార్యదర్శికే వెంచర్ అనుమతి విషయం తెలుస్తుంది.

\-రూపగౌడ్, పంచాయతీ కార్యదర్శి, మనోహరాబాద్





బ్లాస్టింగ్ దడ

స్టోన్ క్రషర్ల పేలుళ్లతో బెంబేలు

- బాంబుల మోతకు ఊడిపడుతున్న స్లాబు పెచ్చులు
- దెబ్బతిన్న అమరవీరుల స్థూపం
- మాధారం, రాళ్లకత్వ, కాజీపల్లి స్థానికుల్లో భయం

జిన్నారం, సెప్టెంబరు 26: మండలంలో స్టోన్ క్రషర్ల బ్లాస్టింగ్‌లు దడ పుట్టిస్తున్నాయి. పేలుళ్లతో స్థానిక గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఎక్కడ క్రషర్ల వద్ద అమర్చిన పేలుడు పదార్థాలు పేలుతాయో అనే భయాందోనలతో క్రషర్ల సమీపంలో వ్యవసాయ పనులు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఇష్టారాజ్యంగా జరుపుతున్న పేలుళ్లతో సమీప గ్రామాల నివాసాలు దెబ్బతింటున్నాయి. స్లాబుల పెచ్చులూడటం, గోడలకు పగుళ్లు రావడం సహా అద్దాలు పగలటం తరుచూ జరుగుతున్నాయి. ఇటీవల మాధారం శివారులోని క్రషర్ క్వారీల వద్ద జరిపిన పేలుళ్ల ధాటికి ఓ వ్యక్తి నివాసం స్లాబు పెచ్చులూడి ప్రమాదం తప్పగా.. స్థానికంగా ఉన్న అమరవీరుల స్థూపం గ్రానైట్ ఫలకలు ఊడిపడ్డాయి. దీనికి తోడు క్రషర్‌ల నుంచి తెల్లటి పౌడర్ సమీపంలోని పంట పొలాలు, నివాసాలను కమ్మేస్తున్నాయి.

భయాందోళనలో గ్రామాలు

మాధారం, కాజీపల్లి గ్రామాల పరిధిలో 15 వరకు కంకర క్వారీలు ఉన్నాయి. ఇక్కడ కొన్ని క్రషర్‌లు నిత్యం భారీ స్థాయిలో పేలుళ్లు జరుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల మేరకు తక్కువ స్థాయిలో 10 అడుగుల వరకు మందుగుండును నింపి పేలుళ్లు చేయాల్సి ఉండగా..


పేలుడు ధాటికి ఊడిన స్లాబు పెచ్చులు


పేలుళ్ల ధాటికి గ్రానైట్ ఫలకలు ఊడిన అమరవీరుల స్థూపాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

అందుకు ఐదు రెట్లు బ్లాస్టింగ్స్ జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా జరుపుతున్న పేలుళ్ల ధాటికి మాధారం గ్రామానికి చెందిన కురుమ దుర్గయ్య నివాసం స్లాబు పెచ్చులూడి పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవంతో పెను ప్రమాదం తప్పింది. ఇక ఇక్కడే ప్రధాన రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్థూపం క్రషర్‌ల పేలుళ్ల ధాటికి దెబ్బతిన్నది. స్థూపానికి అమర్చిన గ్రానైట్ ఫలకలు ఊడిపడ్డాయి. స్థూపాన్ని పరిశీలించిన మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ క్రషర్ల తీరుపై మండి పడ్డారు. కాగా పేలుళ్ల నియంత్రణ అధికారం తమకు లేదని వివిధ శాఖలు నెపాన్ని ఇతరులపై నెట్టేస్తున్నాయి. క్రషర్‌ల పేలుళ్ల సమస్యలపై ఏర్పాటు చేసిన జేఏసీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్, నాయకులు గణేష్ తదితరులు క్వారీల తీరుపై ఇటీవల ఆయా శాఖల అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇక ఇదే సమస్య రాళ్లకత్వ గ్రామ శివారులోని క్రషర్లతో ఉండగా.. కొత్తగా మరికొన్ని క్రషర్ల ఏర్పాటు వద్దని స్థానికులు ఈ నెల 21 సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

పేలుళ్లను నియంత్రించాలి

మాధారం, కాజీపల్లి పరిధిలో ఉన్న పలు స్టోన్ క్రషర్‌ల పేలుళ్లను వెంటనే నియంత్రించాలి. క్రషర్, క్వారీల పేలుళ్లు, ఇతర సమస్యలపై వివిధ శాఖలకు ఇది వరకే ఫిర్యాదు చేశాం. ఉన్న వాటితోనే తీవ్ర సమస్యలు ఉండగా.. కొత్తగా మరికొన్ని క్రషర్, క్వారీల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం సరికాదు.

\- సురేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్




దిగువకు విడుదలవుతున్న వరద జలాలు

సింగూరుకు కొనసాగుతున్న వరద

ఇన్‌ఫ్లో 14,563 క్యూసెక్కులు..అవుట్ ఫ్లో 19,107 క్యూసెక్కులు

పుల్‌కల్, సెప్టెంబరు 26 : సింగూరు ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ వరద నీరంతా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. నాలుగైదు రోజులుగా ప్రాజెక్టుకు ఎగువన మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాలోని జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండగా గురువారం 14,563 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఈనెల 22వ తేదీన అర్ధరాత్రి నుంచి వరద నీటి ప్రవాహం పెరుగడంతో 11వ నంబరు క్రస్ట్ గేట్‌ను మీటరున్నర ఎత్తు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. తాజాగా బుధవారం రాత్రి వరద ఉధృతి మరింత పెరగడంతో గురువారం మధ్యాహ్నం 6వ నంబరు క్రస్ట్‌గేట్‌ను మీటరున్నర ఎత్తు ఎత్తారు. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16,284 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల గుండా 2,823 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు వదులుతున్నారు. దీంతో 9,107 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదవుతున్నది. ప్రాజెక్టులో 29.917 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి 29.827 టీఎంసీలు నిల్వలున్నాయి. 7.5 జల విద్యుత్ సామర్థ్యం గల రెండు టర్బైన్లు పనిచేస్తుండగా 0.36 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. ఇదిలావుండగా, మంజీర రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో 8వ నంబరు క్రస్ట్ గేట్‌ను మూడున్నర మీటర్లు, 7వ నంబరు క్రస్ట్ గేట్‌ను మీటరు ఎత్తు, ఒక స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తు ఎత్తి నీటిని దిగవన ఘనపురం కట్టకు వదులుతున్నారు.

గీతంలో పైలట్ శిక్షణపై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 26: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఫ్లైట్ సిమ్యులేటర్‌'పై ఒకరోజు పైలెట్ శిక్షణ వర్క్‌షాప్ గురువారం జరిగింది. స్పేస్‌జెన్ సీఈవో కెప్టెన్ విగో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విమానం నిలిపిన ప్రదేశం నుంచి పైకి ఎగిరే వరకు మొత్తం ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విమానాన్ని నియంత్రించడం, గాలిలో ప్రయాణిస్తూ చేసే విన్యాసాలు, గాలిలో ఉండగానే ఇంజన్ ఆపి డిప్ స్టిక్ ల్యాండింగ్ చేయడం వంటివి చేసి చూపి, ఫ్లైట్ సిమ్యులేటర్ అనుభవాన్ని విద్యార్థులకు కల్పించారు. తమ ఏరోనాటికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిర్ ఇండియా, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, భారత వైమానిక దళం స్టేషన్ల సందర్శన ఏర్పాటు చేస్తానని చెప్పారు. దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ సందర్శనతోపాటు అక్కడి పైలట్లతో ముఖాముఖి సంభాషణను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్ కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల మాట్లాడారు. కార్యక్రమంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ.అక్తర్ ఖాన్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎస్.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 26 : 2008లో డీఎస్సీ పరీక్ష రాసి 70 : 30 రిజర్వేషన్ వల్ల ప్రభావితమైన అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయటం కోసం ధ్రువపత్రాల పరిశీలనకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాసిన అభ్యర్థులకు ఈ నెల 27, 28 తేదీల్లో సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఉంటుందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ వెరిఫికేషన్‌కు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణతో పాటుగా 2008లో డీఎస్సీ పరీక్ష రాసిన హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ఆధార్ కార్డు, రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన 292 మంది అభ్యర్థుల జాబితా తెలంగాణ పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉన్నాయని, డేటా వెరిఫికేషన్ ఫామ్ కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. డెటా వెరిఫికేషన్ ఫామ్ డౌన్‌లోడ్ చేసుకుని అభ్యర్థుల వివరాలతో పాటుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయడానికి సమ్మతి తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వెరిఫికేషన్ ఫామ్ గెజిట్ అటెస్టేషన్ చేయించి ధ్రువపత్రాలతో హాజరుకావలని సూచించారు. 28వ తేదీ తర్వాత ఎలాంటి వెరిఫికేషన్ ఉండదని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలు

- గిర్మాపూర్ రెసిడెన్షియల్ కాలేజీలో పోటీలు
- హాజరైన రెండు జిల్లాల విద్యార్థులు


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

కొండాపూర్, సెప్టెంబరు 26 : కొండాపూర్ మండలం గిర్మాపూర్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్రీడా ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) ఆర్.గోవిందరామ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి వివిధ కళాశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. అండర్-19 బాలబాలకల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల ఎంపికలను నిర్వహించారు. ఎస్జీఎఫ్ ఇంటర్మీడియట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.గణపతి పర్యవేక్షణలో కొనసాగిన ఎంపిక పోటీల్లో కోచ్ ధన్‌రాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

సమానత్వం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

- జయంతి వేడుకలలో కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్


పూలమాల వేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 26 : వెట్టిచాకిరి చేతులతో బందుక్‌లు పట్టించి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గురువారం చిట్కుల్‌లో ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజకులతో కలిసి కేక్‌ను కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర మొత్తం త్యాగధనుల అమరత్వమేనని, ఆ మహనీయుల ఉద్యమస్ఫూర్తితోనే తెలంగాణలో ప్రశ్నించే తత్వం అలవడిందన్నారు. నిజాం నిరంకుశ పాలనలో శిథిలమైపోయిన బతుకులను బాగు చేయడానికి వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దొరలు, జమీందారుల చేతుల్లో బానిసలుగా మగ్గుతున్న బహుజనులకు స్ఫూర్తినిస్తూ నిజాంకు ఎదురునిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలని సంకల్పంతో హైదరాబాద్ కోటిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరుని పెట్టి, ఆ వీరనారికి గుర్తింపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రేవంత్‌రెడ్డి స్ఫూర్తితో సబ్బండ వర్గాల హక్కుల కోసం పోరాడుతూ, వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నీలం మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చాకలి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్, మురళీ, రాజ్ కుమార్, ఆంజనేయులు, నారాయణరెడ్డి, చాకలి సత్తయ్య, చాకలి కృష్ణ, చాకలి బాబు, నర్సింలు, యాదయ్య, కిషోర్ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రావి ఆకుపై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రం


రావి ఆకుపై బాపూజీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 26 : ఈ నెల 27న స్వాతంత్ర్య సమర యోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ ఆయన చిత్రాన్ని గురువారం రావి ఆకుపై వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి స్వశక్తితో ఎదిగిని మహోన్నత వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. స్వాతంత్రోద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ వరకు ఆయన చూపిన పోరాట పటిమ మరువలేనిదన్నారు. తెలంగాణ సమాజానికి బాపూజీ ఎప్పటికి నిలుస్తారన్నారు. ఆయన జయంతి సందర్భంగా రాగి ఆకుపై చిత్రం వేసి శుభాకాంక్షలు తెలిపారు.

పరిహారం ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తాం

- వర్గల్ టీజీఐఐసీ భూముల వద్ద నాల్గో రోజుకు చేరిన భూనిర్వాసితుల ఆందోళన


వర్గల్ టీజీఐఐసీ భూముల వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

వర్గల్, సెప్టెంబరు 26 : వర్గల్ మండల కేంద్రంలో టీజీఐఐసీ భూముల వద్ద భూనిర్వాసితులు చేస్తున్న ఆందోళన బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నది. టీజీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో దక్కాల్సిన పరిహారాన్ని అందించాలని, కోట్లాది రూపాయల విలువ చేసే సాగు భూములకు అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.10 లక్షలు ఇచ్చి భూములను రైతుల వద్ద నుంచి బలవంతంగా లాక్కున్నారని వాపోయారు. ప్రతీ రైతుకు 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణం కోసం ఇస్తామని ఇంటి నంబర్ టోకెన్ మాత్రమే ఇచ్చారని, ఇప్పటి వరకు ఇంటి స్థలం చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద తక్కువ ధరకు భూములు తీసుకున్న అప్పటి ప్రభుత్వం పరిశ్రమలకు కోట్లాది రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని భూనిర్వాసితులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంత వరకు టీజీఐఐసీ భూముల్లో నిర్మాణమవుతున్న పరిశ్రమల నిర్మాణాలను అడ్డుకుంటామన్నారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్

- ఐదు రోజుల పాటు వేడుక
- ఆటపాటలతో ఆడపడుచుల సందడి
- నేటి నుంచి ప్రారంభం




బొడ్డెమ్మతో చిన్నారి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 26 : చాలా పండుగల నేపథ్యం, సంప్రదాయాలు ప్రకృతితో ముడిపడి ఉంటాయి. అలాంటివే తెలంగాణ వ్యాప్తంగా ఆడపడుచులు సంబురంగా జరుపుకొనే బొడ్డెమ్మ, బతుకమ్మ. బతుకమ్మ పండుగకు ముందుగా బొడ్డెమ్మ పండుగ చేసుకుంటారు. బతుకమ్మను భాద్రపద మాసంలో వచ్చే మహాలయ అమావాస్య (పెద్దల అమావాస్య) నుంచి 9 రోజుల పాటు నిర్వహిస్తారు. బతుకమ్మకు ముందు 5 రోజులు దశమి, 3 రోజులు ద్వాదశి నుంచి బొడ్డెమ్మ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. మరికొన్ని చోట్ల 9 రోజులు పాటు బొడ్డెమ్మలు ఆడుతారు. ఐదు రోజులు బొడ్డెమ్మల పండుగ సందడి శుక్రవారం నుంచి మొదలవుతుంది. బతుకమ్మను ఆడపడుచులందరు ఆటపాటలతో పూజిస్తారు. బొడ్డెమ్మను పెళ్లికానీ యువతులు, బాలికలు ఎక్కువగా చేసుకుంటారు.

పుట్టమన్ను తెచ్చి.. పూలతో అలంకరించి

ప్రకృతిలో దొరికే మట్టితో పూలతో అనుబంధమున్న పండుగ ఈ బొడ్డెమ్మ. దీనికి బొట్టె, బొడిప, పొట్టి అనే పర్యాయపదాలున్నాయి. బొడ్డ అనే పదానికి అత్తిచెట్టు అనే మరో అర్థం ఉంది. దీన్నే మేడిచెట్టు, ఔదంబర చెట్టుగా పిలుస్తారు. పిల్లలు లేనివారు సంతానం కలగాలని, పెళ్లి కానీ వారు వివాహం కుదరాలని మేడిపూజ చేసేవారు. ఈ చెట్టులో ఉన్న ఔషదీయ గుణాలు అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. ముఖ్యంగా స్త్రీలలో వచ్చే సమస్యలకు దివ్యౌషధంగా పనిచేస్తుందటారు. ప్రాచీన కాలం నుంచి మేడిపూజ చేస్తూ కాలక్రమేణా బొడ్డెమ్మ పూజగా మారిందని తెలుస్తోంది. బొడ్డెమ్మను చేయడానికి పుట్ట దగ్గరకు వెళ్లి పాలు, పసుపు, కుంకుమ సమర్పించి, పూజలు చేసి పుట్ట మన్నును తీసుకొస్తారు. చెక్కపీటపై మట్టితో మూడు లేదా ఐదు గడులతో గోపురం ఆకారం వచ్చేలా తయారుచేస్తారు. ఆ తర్వాత ఎర్రమట్టితో అలికి, ముగ్గ వేసి, పసుపు, కుంకుమతో బొట్టు పెడతారు. పూలతో అలంకరించి, గుమ్మడి పువ్వు కానీ, పసుపుతో గౌరమ్మను చేసి పూజిస్తారు. బొడ్డెమ్మలను ఒకచోట చేర్చి 'బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్, బిడ్డా లేందారు కోల్, నీ బిడ్డ నీలగౌరు కోల్' అంటూ బొడ్డెమ్మగా ఉన్న గౌరమ్మను మహిళలు, యువతులు బొడ్డెమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో వేడుకుంటారు. తర్వాత 'నిద్రపో బొడ్డెమ్మ, నిద్రపోవమ్మా, నిద్రాకు నూరేండ్లు, నీకు వెయ్యేండ్లు నిన్నుగన్న తల్లికి నిండా నూరేళ్లు అని పాడి' బొడ్డెమ్మను తీసి దేవుడి ముందు పెడతారు. ఇలా ఐదు రోజులు ఆడి చివరి రోజున చెరువు దగ్గరకు తీసుకెళ్లి చెక్కపీటమీద ఉన్న బొడ్డెమ్మను 'పోయి రా బొడ్డెమ్మ పోయిరావమ్మా' అంటూ నిమజ్జనం చేస్తారు. బొడ్డెమ్మ తర్వాత బతుకమ్మ సంబరాలు మొదలవుతాయి.

పండుగ వస్తుందంటే సంతోషం



బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగ వస్తుందంటే సంతోషంగా ఉంటుంది. పొద్దునే పుట్ట మన్ను తెచ్చి, పూలతో అలంకరిస్తాం. రోజు సాయంత్రం ఒక చోట బొడ్డెమ్మలను పెట్టి కోలాటమాడతాం. ప్రసాదాలు పంచుకుని గౌరమ్మను మొక్కుతాం. ప్రకృతిని ఆరాధించటం మన సంప్రదాయంలో ఒక భాగంగా ఉంటుంది.

- అనిత, సిద్దిపేట

అందరం కలిసి ఆడుకుంటాం



నేను ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తాను. బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగ అంటే చాలా ఇష్టం. చుట్టుపక్కల వాళ్లు, గల్లీలో ఒకచోట చేర్చి బొడ్డెమ్మ ఆడుకుంటాం. పాటలు పాడుతూ కోలాటం ఆడుకుంటాం. ప్రకృతిని పూజించటమనే సంస్కృతి చాలా గొప్పగా అనిపిస్తుంది.

- స్నేహ, సిద్దిపేట

పండుగల వెనుక శాస్త్రీయత



నేను సైన్స్ స్టూడెంట్‌ను. నాకు పండుగ వాతవరణం అంటే ఇష్టం. బొడ్డెమ్మలు అందరు ఒకచోట చేరి పాటలు పాడుతూ ఆడటం అంటే ఆనందంగా ఉంటుంది. పండుగల్లోనూ శాస్త్రీయత దాగుంది. పండుగల వల్ల మానావాళికి ఎంతో మేలు జరుగుతుంది.

- శిరిష, స్టూడెంట్

నీటిపారుదల శాఖ ఏఈఈగా మగ్దుంపూర్ యువతి


బట్ట రేణుక

నంగునూరు, సెప్టెంబరు 26 : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన బట్ట రేణుక నీటిపారుదల ఏఈఈగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని జలసౌధలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నీటిపారుదల ఉన్నతాధికారుల చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. నంగునూరు మండలం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోస్టింగ్ పొందారు. టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో బట్ట రేణుక రాష్ట్రంలో మహిళ కేటగిరీలో 4వ ర్యాంక్ సాధించి సత్తా చాటారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన రేణుక మూడేళ్ల వయసులోనే తండ్రి అయిలయ్య చనిపోయారు. తల్లి రాజవ్వ వ్యవసాయ కూలీగా, బీడీలు చుడుతూ కూతురును పోషించింది. మగ్దుంపూర్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. టెన్త్‌లో 555 మార్కులు సాధించి మండల ఫస్ట్‌గా నిలిచింది. బాసరలోని ఐఐఐటీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసింది. ఉస్మానియా యూనివర్శిటీలో ఎంఈ చేశారు. ఐఐటీ(హైదరాబాద్)లో పీహెచ్‌డి చేస్తున్నారు. రేణుకను గ్రామస్థులు, బంధువులు అభినందించారు.

మీ ఇంట్లో ఇలాగే వండుకుని తింటారా?

- జేఎన్టీయూ వంట గదిలో అపరిశుభ్రంపై ఆర్డీవో ఆగ్రహం
- బాలిక వసతి గృహం వంట శాలలో ఆకస్మిక తనిఖీలు
- సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని ఎమ్మార్వోకు ఆదేశం
- అందుబాటులో లేని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్


బాలికల వసతి గృహంలోని వంట గదిని పరిశీలిస్తున్న ఆర్డీవో పాండు, తహసీల్దార్ ఈశ్వరీరాణి

పుల్‌కల్, సెప్టెంబరు 26 : చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వసతి గృహల్లో మెస్ నిర్వహణ తీరుపై ఆర్డీవో పాండు మండిపడ్డారు. 'మీ ఇంట్లో ఇలాగే వండుకుని తింటారా' అంటూ అసహనం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం చట్నీలో ఎలుక పడి వివాదాస్పదమైనా మార్పు రాలేదు. అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, చౌటకూర్ తహసీల్దార్ ఈశ్వరీరాణి, ఆర్ఐ నాగరాజు గురువారం మధ్యాహ్నం భోజన తయారు చేసే సమయంలో జేఎన్టీయూ కళాశాలలోని బాలికల వసతి గృహన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎప్పటిలాగే వంట గది ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, వంట గదిలో నుంచి మురుగు నీరు పారుదల సక్రమంగా బయటకు వెళ్లకపోవడం వంటి వాటిని వారు గమనించారు. వంటలకు వినియోగించే నూనే, కారం, వెల్లుల్లి, పసుపు ఇతర మసాలలు నాణ్యత లేకపోవడాన్ని గుర్తించారు. పెరుగు ప్యాకెట్లను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచడంతో అవి గడ్డకట్టి ముంచుగడ్డను తలపించాయి. వంటపాత్రలు శుభ్రం చేసే గది నుంచి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు పైపులైన్ సక్రమంగా లేకపోవడంతో పాటుగా ఉన్న మ్యాన్‌హోల్ సైతం చెత్తాచెదారంతో నిండిపోయి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తున్నది. మ్యాన్‌హోల్‌లో నిండిపోయిన వ్యర్థ జలాలు పొంగిపొర్లుతుండటంతో వంట గది, వసతిగృహం ఆవరణ అంతా ముక్కుపుటలదిరేలా వాసన వ్యాపిస్తుంది. ఇలాగైతే విద్యార్థులు భోజనం ఎలా చేస్తారని ఆర్డీవో పాండు, తహసీల్దార్ ఈశ్వరీరాణి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారానికి రెండు పర్యాయాలు వసతి గృహలను తనిఖీ చేసి భోజనం చేయాలని తహసీల్దార్ ఈశ్వరీరాణిని ఆర్డీవో పాండు ఆదేశించారు. అధికారుల తనిఖీ సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావులు అందుబాటులో లేరు. ఆర్డీవో పాండు ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి వారం రోజుల్లోగా వసతి గృహలను శుభ్రం చేయాలని, అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేస్తే విద్యార్థులు ఎలా తింటారని ప్రశ్నించారు. వసతి గృహలను పరిశుభ్రంగా ఉంచని సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని, వినకపోతే విధుల నుంచి తొలగించాలని ఆర్డీవో ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.

అటవీ ఆహ్లాదంతో ఇంపు..

మహానగర చెత్త వేస్తే కంపు

- అటవీ ప్రాంతం సమీపంలో ప్యారానగర్ వద్ద డంపుయార్డు
- ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటుకు ప్రయత్నం
- అప్పటి నుంచి అడ్డుకుంటున్న స్థానికులు
- మళ్లీ అధికారుల కసరత్తుతో చుట్టుపక్కల గ్రామాల్లో అలజడి

నర్సాపూర్/గుమ్మడిదల, సెప్టెంబరు 26 : హైదరాబాద్‌లో సేకరించే చెత్త కోసం అటవీ ప్రాంతం సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలు స్థానికులను తీవ్రంగా కలచివేస్తుంది. పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న నర్సాపూర్, గుమ్మడిదల అటవీ ప్రాంతంలోకి మహానగర చెత్తను తీసుకొస్తే నాశనమవుతుందని, ఈ కంపు తమకెందుకు అంటూ ఇక్కడి వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ప్యారానగర్ సమీపంలో డంపుయార్డుకు కేటాయించిన స్థలం

150 ఎకరాలు కేటాయింపు

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో హైదరాబాద్ నగరానికి నాలుగు వైపులా నగరానికి దూరంగా డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా నర్సాపూర్, గుమ్మడిదల అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ వద్ద డంపుయార్డు కోసం 150 ఎకరాలను నాడు కేటాయించారు. ఇక్కడికి వెళ్లేందుకు అటవీ ప్రాంతం నుంచి రోడ్డు కోసం ఆ శాఖ కూడా ఆమోదం తెలిపినట్లు సమాచారం. అటవీశాఖ కేటాయించే స్థలానికి గాను జీహెచ్‌ఎంసీ అప్పట్లో డబ్బు కూడా చెల్లించినట్లు తెలిసింది. అయితే, అధికారుల ప్రయత్నాలను ఎప్పటికప్పుడు స్థానికులు అడ్డుకుంటూ వస్తూనే ఉన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా డంపింగ్‌యార్డు ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగగా, స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో వెనక్కు తగ్గారు. ఇన్నాళ్లకు మళ్లీ డంపుయార్డు ఏర్పాటును అధికారులు ముందుకు తీసుకొచ్చారు.

విద్యుత్ ఉత్పత్తి కోసం.. వద్దే వద్దు

ప్యారానగర్ డంపింగ్‌యార్డులో చెత్త నిల్వ లేకుండా శాస్త్రీయ విధానాలు అవలంభిస్తామని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ పరిధిలోని జవహర్‌నగర్ డంపుయార్డులో వేసిన చెత్తను వేరు చేసి విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే వ్యర్థాలను మాత్రమే ప్యారానగర్‌కు తీసుకెళ్లాలనే ఆలోచన తప్ప, పూర్తిగా చెత్తను అక్కడ వేయడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలోని పది గ్రామాలకు చెందిన వారు ఎట్టిపరిస్థితుల్లో వద్దంటూ అడ్డుకుంటూ వస్తున్నారు. తెలంగాణ వచ్చాక ఈ మేరకు ఆయా పంచాయతీలు తీర్మానాలు చేసి అధికారులకు అందజేశారు. దీంతో కాస్త వెనక్కు తగ్గినట్టు అనిపించినా తిరిగి ఇప్పుడు డంపింగ్‌యార్డు కోసం పావులు కదుపుతుండడంతో మళ్లీ అలజడి మొదలైంది. అటవీప్రాంతం సమీపంలో చెత్తను వేయడం వల్ల అటవీప్రాంతం దెబ్బతినడమే కాకుండా గుమ్మడిదల, నల్లవల్లి, ప్యారానగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల వాతావరణం దెబ్బతింటుందని స్థానికులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా అటవీప్రాంతం గుండా వర్షపు నీరు నర్సాపూర్ చెరువులోకి వస్తుందని, డంప్‌యార్డు ఏర్పడితే అడవిలోని చెక్‌డ్యాంలు, కుంటలు కలుషితమై చెరువు కూడా దెబ్బతినే అవకాశముందని పట్టణంలో నివసించే వారు వాపోతున్నారు.



డంపుయార్డు ఏర్పాటుపై గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం

రాజకీయాలు పక్కన పెట్టి ఉద్యమించాలి



2015లో ప్యారానగర్ శివారులో డంపుయార్డు ఏర్పాటు కాబోతుందని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ప్రజలలో చైతన్యం వచ్చింది. ప్రజల వ్యతిరేకతను వివరిస్తూ ముందుగా 'ఆంధ్రజ్యోతి'లో ఇచ్చిన కథనాలతో ప్రభుత్వంలో మార్పు వచ్చింది. జిల్లా పరిషత్ సమావేశంలో అప్పటి మంత్రి హరీశ్‌రావుకు వివరించి నాడు డంపుయార్డు ఏర్పాటును అడ్డుకున్నాం. మరోమారు డంపుయార్డు ఏర్పాటును తెరమీదకు తీసుకొచ్చారు. రాజకీయాలు పక్కన పెట్టి అన్ని పార్టీల నాయకులు డంపుయార్డుపై ఉద్యమించాలి. ఈ విషయమై మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వివరించగా సానుకూలంగా వారు స్పందించారు. ప్రజల అభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి వివరిస్తానని హామీ ఇచ్చారు.

- కుమార్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ, గుమ్మడిదల

విరమించుకోవాలి



నర్సాపూర్, గుమ్మడిదల అటవీ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. నర్సాపూర్ అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న రాయరావు చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ప్యారానగర్‌లో డంపుయార్డు వల్ల చెరువు పూర్తిగా కలుషితమవుతుంది. దీనిని ఎట్టి పరిస్థితులో సహించేది లేదు. డంపుయార్డు ఏర్పాటు యత్నాలను విరమించుకోవాలి. లేదంటే గుమ్మడిదల సమీపంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు నర్సాపూర్ పట్టణ ప్రజలతో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు.

- అశోక్‌గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్

డంపుయార్డు వద్దంటూ నర్సాపూర్ మున్సిపాలిటీ తీర్మానం

నర్సాపూర్, సెప్టెంబరు 26 : ప్యారానగర్ అటవీ ప్రాంతం సమీపంలో డంపుయార్డు ఏర్పాటుతో అటవీ పరిసరాలతో పాటు నర్సాపూర్ రాయరావు చెరువు కలుషితమయ్యే ప్రమాదమున్నందున విరమించుకోవాలని నర్సాపూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ఇక్కడ డంపుయార్డు ఏర్పాటైతే వ్యర్థాలు వర్షాలు పడే సమయంలో ఆయా గ్రామాల చెరువులతో పాటు నర్సాపూర్ రాయరావు చెరువులోకి వచ్చే అవకాశముందని దీంతో సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతుందన్నారు. అందువల్ల డంపుయార్డు ఏర్పాటును మానుకోవాలని తెలిపారు. సమావేశంలో పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులు, పారిశుద్య, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వాహణ తదితర అంశాలపై చర్చించారు. దాదాపు నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్దంగా ఉన్న మున్సిపల్ భవనంను కూడా మిగిలిపోయిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని సమావేశంలో పీఆర్ డీఈఈ రాధికకు సూచించారు. త్వరలో నర్సాపూర్‌లో గొర్రెలు, మేకల సంతను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ రామకృష్ణరావు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో చూసినా.. ఈతగాళ్లు వెతికినా దొరకని ఆచూకీ

- నారింజ వాగులో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు
- వాగులో జల్లెడపట్టించిన అధికారులు
- ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల కోసం సిఫారస్


ఆచూకీ కోసం డ్రోన్ ఆపరేటర్ సహాయంతో వెతుకుతున్న సిబ్బంది

జహీరాబాద్, సెప్టెంబరు 26 : ఈతగాళ్లు రంగంలోకి దిగినా.. డ్రోన్ కెమెరా సహాయంతో వెతికినా వాగులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ తెలియలేదు. మండల పరిధిలోని బూచనెల్లి-బరూర్ గ్రామాల మధ్యలో గల నారింజ వాగు లోలెవెల్ బ్రిడ్జి వద్ద బుధవారం గల్లంతైన షాకీర్ ఆచూకీ కోసం ఎంత వెతికినా జాడ తెలియలేదు. గురువారం తసీల్దార్ రవీందర్, సిబ్బందితో కలిసి వాగు వద్దకు చేరుకుని ఆనవాళ్ల కోసం పర్యవేక్షణ చేపట్టారు. చేపలను పట్టే ఈతగాళ్లను రప్పించి వెతికేందుకు ప్రయత్నించినప్పటికి వాగులో నీటిప్రవాహ ఉధృతి ఎక్కువ ఉండడంతో వాళ్లు కొద్ది దూరం వెతికి వెనక్కి వచ్చారు. వాగు ప్రాంతంలో డ్రోన్ కెమెరా సహాయంతో ఏమైనా ఆనవాళ్లు దొరుకుతాయేమోనని అధికారులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడమైందని ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల కోసం సిఫారస్ చేశామని తహసీల్దార్ రవీందర్ తెలిపారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు వచ్చాక షాకీర్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతామన్నారు. వాగులో గల్లంతైన షాకీర్ ఇప్పటికే మృతిచెంది ఉంటాడని అధికారులు భావిస్తున్నారు. మృతదేహాన్ని వాగులో నుంచి తీసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నారింజ వాగు వరద ఉధృతి ఎక్కువ ఉన్నందున వాగులో నుంచి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు గాను రోడ్డుకు అడ్డంగా కంచెను వేసి రాకపోకలు సాగించొద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, ఆర్ఐలు రుక్మొద్దీన్, యాదిలాల్, గ్రామస్థులు ఉన్నారు.


నారాయణఖేడ్‌లో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


పటాన్‌చెరు: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


సంగారెడ్డి అర్బన్: ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ క్రాంతి


మెదక్ అర్బన్: ఐలమ్మకు నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఐలమ్మకు ఘన నివాళి

చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటితరానికి ఆదర్శమని పలువురు పేర్కొన్నారు. ఐలమ్మ 129వ జయంతిని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ పౌరుషాన్ని, పోరాట స్ఫూర్తిని చాటిన ధీర వనిత ఐలమ్మ అని పలువురు కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారని అన్నారు. చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు: ఎమ్మెల్యే

నారాయణఖేడ్, సెప్టెంబరు 26: నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని హన్మంత్‌రావుపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిరంతరం విద్యుత్‌కోసం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాహేర్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, నారాయణ పాల్గొన్నారు. కాగా పెద్దశంకరంపేట మండలం మక్తలక్ష్మాపూర్‌కు చెందిన సుశీలకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.70 వేల ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. నారాయణఖేడ్‌లో భవిష్యత్తులో రెగ్యులర్ ఎంవీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించి రవాణాశాఖ సేవలందిస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ప్రస్తుతానికి నారాయణఖేడ్‌లో వారానికి రెండురోజులు సేవలందించడానికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, నాయకులు ఉన్నారు.

విద్యాసంస్థల్లో 'స్వచ్ఛతా హీ సేవా'

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్/కంగ్టి/హవేళిఘణపూర్, సెప్టెంబరు 26: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దామని తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ఎస్.ఎస్.రత్నప్రసాద్ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించడంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. నారాయణఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా 'స్వచ్ఛత' అనే అంశంపై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గురువారం కంగ్టి మండల పరిధిలోని దెగుల్‌వాడి గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో సత్తయ్య 7వ తరగతి విద్యార్థులకు గణితం పాఠాలు బోధించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు చేతి గ్లౌస్‌లు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. మండల కేంద్రమైన హవేళిఘణపూర్ గ్రామంలోని హనుమాన్ గుడి వద్ద యువకులు గురువారం స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు. గుడివద్ద ఉన్న ముళ్లపొదలు, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి: డీపీవో

హత్నూర, సెప్టెంబరు 26: గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామాన్ని గురువారం సాయంత్రం పరిశీలించారు. గ్రామంలోని పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, మురుగుకాలువలు, గ్రామంలో పారిశుధ్యంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వ్యక్తిగత పారిశుధ్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత ఉంచుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. వీరి వెంట ఎంపీఈవో యూసుఫ్ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి అర్బన్: తారా కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో విద్యార్థులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మనూరు, సెప్టెంబరు 26: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో అలివేలు మంగ ప్రజలక సూచించారు. గురువారం మనూరు మండల పరిధిలోని బాదల్‌గాంలోని పాఠశాల, పీహెచ్‌సీ, అంగన్‌వాడీలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సతీష్, ఉపాధ్యాయులు నారాయణ, సంగారెడ్డి, పాల్గొన్నారు.

సమాచారం

ఆయిల్‌పామ్ సాగుతో దిగుబడి

కొండాపూర్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు సాధించొచ్చని మండల ఉద్యానశాఖ అధికారి శైలజ తెలిపారు. మండల పరిధిలోని మారెపల్లిలో రైతు మనోజ్‌రెడ్డి సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ సాగును పరిశీలించారు.

కళా ఉత్సవ్ పోటీలు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 26: చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో జడ్పీహెచ్ఎస్(చిన్నశంకరంపేట), జడ్పీహెచ్ఎస్(సూరారం), జడ్పీహెచ్ఎస్(చందంపేట), జడ్పీహెచ్ఎస్(మిర్జాపల్లి) తదితర పాఠశాలల విద్యార్థినులు పాల్గొని నృత్యం చేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంఈవో పుష్పవేణి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు దీప్లారాథోడ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతంపై దృష్టి పెట్టాలి: డీఈవో

వెల్దుర్తి, సెప్టెంబరు 26: విద్యార్థుల హాజరు శాతంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టి ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. గురువారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల సముదాయ సమావేశాన్ని డీఈవో ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల సముదాయ సమావేశానికి ప్రతిఒక్కరూ విధిగా హాజరుకావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల పనితీరు మెరుగుపడాలని, విద్యార్థుల కోసం వారి గుణాత్మక అభివృద్ధి జరగాలని సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్‌కు సంబంధించిన గోడపత్రికను వెల్దుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఉపాధ్యాయులతో కలిసి డీఈవో ఆవిష్కరించారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న పంచాయతీ సిబ్బందిపై దౌర్జన్యం

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 26: అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న పంచాయతీ సిబ్బందిపై దౌర్జన్యం చేయటంతో స్వల్పంగా ఉద్రిక్తత ఏర్పడింది. ఇస్నాపూర్ పంచాయతీ పరిధిలో ఇస్నాపూర్ పాశమైలారం రహదారికి అనుకొని నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపట్టడంతో సదరు భవన యజమానికి గతంలో పంచాయతీ పాలకవర్గం నోటీసు జారీచేసింది. సెల్లార్‌తో పాటు అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడంతో ఇటీవల నిర్మాణం పనులను సైతం పంచాయతీ పాలకవర్గం అడ్డుకుంది. అయినా సదరు భవన యజమాని యథాతథంగా పనులు కొనసాగించడంతో ఇస్నాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కారోబార్ నాగభూషణం తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పనులు నిలిపేయగా.. అక్కడే పనిచేస్తున్న కొంతమంది పంచాయతీ యంత్రాంగం పట్ల దౌర్జన్యపూరితంగా వ్యవహరించారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన కార్యదర్శి అక్కడి పరికరాలను పంచాయతీకి తరలించారు. ఇస్నాపూర్ పాశమైలారం రహదారి పక్కనే సెట్‌బ్యాక్స్ లేకుండా రోడ్డుకు అనుకునే ఈ నిర్మాణం జరగడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంతో పాటు భవిష్యత్తులో రోడ్డు విస్తరణ పనులకు ఇబ్బంది కలిగి అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.


అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న పంచాయతీ కార్యదర్శి తదితర సిబ్బంది

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

నాగల్‌గిద్ద/హత్నూర/అల్లాదుర్గం, సెప్టెంబరు 26: పీఆర్టీయూ నాగల్‌గిద్ద మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నికల పరిశీలకులు మోహన్, మల్లయ్యల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేరికార్ రమేష్, ప్రధాన కార్యదర్శిగా నాగ్‌నాథ్‌లను ఎన్నుకున్నారు. తమ ఎన్నికలకు సహకరించిన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్టీయూ హత్నూర మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా పద్మనాభంలు ఎన్నుకున్నారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.అరుణ్‌కుమార్, శిరీష, ఉపాధ్యక్షుడిగా ఎండీ.అజ్మత్ ఆలీ, మహిళా కార్యదర్శిగా కె.అరుణ, కార్యదర్శులుగా కె.నటరాజ్, సుమలతలను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. అల్లాదుర్గం మండలం చిల్వేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బి.జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా రంజ్యానాయక్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.నాగరాజు, మహిళా కార్యదర్శిగా సవిత, కార్యదర్శిగా ఎండీ.అలీమోద్దీన్‌లను ఎన్నుకున్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతోంది: ఎస్పీ

మెదక్ అర్బన్, సెప్టెంబరు 26: పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతోందని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎఆర్‌హెడ్ కానిస్టేబుల్ నుంచి ఎఆర్‌ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన అధికారులు వెంకటరాములు, లక్ష్మీనారాయణ గురువారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు. 28 జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని ఎస్పీ ఉదయకుమార్ రెడ్డి సూచించారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి: సరస్వతి

మనోహరాబాద్, సెప్టెంబరు 26: మహిళలు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు డీఆర్డీవో సరస్వతి అన్నారు. గురువారం మనోహరాబాద్‌లోని సమైక్య కార్యాలయంలో సీసీలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలు రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. లోకల్ జాతికి సంబంధించిన కోడిపిల్లలు ఒకటి రూ.110 చొప్పున రుణం ద్వారా పొందొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎం పెంటాగౌడ్, సీసీలు కృష్ణవేణి, మంజుల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తపస్ జిల్లా కార్యదర్శిగా సుమతి

చేగుంట, సెప్టెంబరు 26: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) మెదక్ జిల్లా కార్యదర్శిగా చేగుంట మండలం రెడ్డిపల్లి ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు చిలుముల వెంకటసుమతి ఎన్నికయ్యారు. గురువారం తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ ఆమెకు నియామకపత్రం అందజేశారు.

వైన్స్ స్థల వివాదంపై విచారణ

వట్‌పల్లి, సెప్టెంబరు 26: వట్‌పల్లిలోని మద్యం దుకాణ స్థల వివాదంపై విచారణ జరుపుతున్నట్లు స్థానిక ఎంపీవో ఖాజా నజీరోద్దీన్ గురువారం తెలిపారు. వట్‌పల్లికి మంజూరైన మద్యం దుకాణాన్ని మండలంలోని గొరైకల్ గ్రామంలో ఏర్పాటు చేయడంపై అప్పట్లో స్థానికులు కొందరు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో విచారణకు ఆదేశించిన కలెక్టర్‌కు గ్రామపంచాయతీ కార్యదర్శి ఈ మద్యం దుకాణం వట్‌పల్లిలోనే ఏర్పాటు చేశామని తప్పుడు నివేదిక ఇవ్వడంతో మరోమారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబ దుకాణ స్థలంపై విచారణ జరిపి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

జహీరాబాద్ అభివృద్ధికి రూ.145 కోట్లతో ప్రతిపాదనలు

● కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి, తదితరులు

జహీరాబాద్, సెప్టెంబరు 26: జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికిగాను రూ.145 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన గెస్ట్‌హౌజ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా నియోజకవర్గంలో అన్నిరంగాలు మరుగున పడ్డాయన్నారు. తాము అధికారంలోకి వచ్చాక సెట్విన్ కార్పొరేషన్ గిరిధర్‌రెడ్డి, తాను కలిసి ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకున్నామన్నారు. జహీరాబాద్ అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు అవసరమున్న నేపథ్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామని తెలిపారు. కాగా ఉజ్వల్‌రెడ్డి ఐలమ్మ జయంతిలో కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు గుండారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, మంకాల్ సుభాష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ సైన్స్ విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన

నర్సాపూర్, సెప్టెంబరు 26: నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సైన్స్ విద్యార్థులను క్షేత్రస్థాయిలో అవగాహన కోసం హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్ఐ క్యాంపస్‌లకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎన్‌జీఆర్ఐలో భూమిలో శిలలు ఏర్పడే విధానం, శిలలో ఉన్న ఖనిజ లవణాలను గుర్తించే విధానం, శిలల వయస్సును నిర్ధారించే విధానాన్ని అక్కడి శాస్త్రవేత్తలు విద్యార్థులకు వివరించారు. అలాగే సూర్యగ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడే విధానం అగ్నిపర్వతాలు, అయస్కాంతధర్మం, సైబర్ క్రైమ్ అంశాలపై శాస్త్రవేత్తలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీసీఎంబీలో జీవులపై జరుగుతున్న వివిధరకాల ప్రయోగాలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో 90 మంది విద్యార్థులతో పాటు అధ్యాపకులు డాక్టర్ సురేష్‌కుమార్, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ సౌజన్య, వృక్షశాస్త్ర అధ్యాపకురాలు రుక్మిణి, రసాయనశాస్త్ర అధ్యాపకులు ఆరిఫ్, రమేష్ పాల్గొన్నారు.

సునితారెడ్డి ఇంటిపై దాడిచేసిన ఆధారాలు బయటపెట్టాలి

● కాంగ్రెస్ నాయకుల డిమాండ్

శివ్వంపేట, సెప్టెంబరు 26: రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్‌ను ఎమ్మెల్యే సునితారెడ్డి గుండాల పార్టీగా అభివర్ణించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాధవరెడ్డి, సుధీర్‌రెడ్డి, నవీన్‌గుప్తాలు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుడు చంద్రాగౌడ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. గురువారం గోమారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కల్లబొల్లి మాటలు చెప్పి వార్డుమెంబరు నుంచి గ్రంథాలయ సంస్థ చైర్మన్ తెచ్చుకున్న చంద్రాగౌడ్‌కు రాజకీయ భిక్ష పెట్టిన మదన్‌రెడ్డిని, మైనంపల్లి హనుమంతరావును విమర్శించే స్థాయి కాదని అన్నారు. సునీతారెడ్డి ఇంటిపైకి రాళ్లు విసిరిన ఆధారాలు ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. చంద్రాగౌడ్ కాల్ లిస్టును బయటపెట్టాలని మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తా, సుధీర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కాముని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లాలో హైడ్రా శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంఏ.రహ్మాన్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 26: సంగారెడ్డి జిల్లాలో చెరువులు, ప్రభుత్వ భూములపై హైడ్రా శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంఏ.రహ్మాన్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువులు, ప్రభుత్వ భూముల్లో పేదలకు సంబంధించిన, పెద్దలవి నిర్మాణాలు ఎన్ని ఉన్నాయనే విషయాన్ని నిగ్గుతేల్చాలన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములను కబ్జాచేసిన వారిపై హైడ్రా చర్యలు తీసుకోవడం మంచిదేనని, కానీ హైడ్రాతో అనేక మంది పేదలు అన్యాయానికి గురవుతున్నారన్నారు. వారికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

'మైనంపల్లి' భాష అసహ్యించుకునేలా ఉంది

● మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్

నర్సాపూర్, సెప్టెంబరు 26: కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్ఎస్ ముఖ్య నాయకులపై మాట్లాడుతున్న భాష ప్రజలు అసహ్యించుకునేలా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ ఖండించారు. గురువారం నర్సాపూర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, సీనియర్ నాయకుడు సత్యంగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ హన్మంతరావు బీఆర్ఎస్‌లో ఉన్నపుడు తమ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నెత్తిన పెట్టుకున్నారని, తన రాజకీయ అవసరాల కోసం పార్టీ మారి అదే నాయకులపై ఇష్టానుసారంగా మాట్లాడడం తగదన్నారు.

కేన్సర్‌తో పీడీ నర్సింహులు మృతి


నర్సింహులు (ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 26: కేన్సర్‌తో సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన బోట్ల నర్సింహులు (ఫిజికల్ డైరెక్టర్) మృతిచెందాడు. నర్సింహులు కోహీర్ మండలం గురుజువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్నినెలలుగా పీడీగా పనిచేస్తున్నారు. రెండేళ్ల నుంచి కేన్సర్‌తో బాధపడుతున్న నర్సింహులు వైద్యం కోసం రూ.35 లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబీకులు తెలిపారు. పరిస్థితి విషమించి గురువారం మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య వాణి, కుమారుడు హరీశ్ భరద్వాజ్, కూతురు స్వీటీ ఉన్నారు. నర్సింహులు మృతితో కాసాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రెడ్డిపల్లి ఘటనలో ఇరువర్గాలపై కేసులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 26: పాతకక్షల కారణంగా గొడవపడిన అల్లాదుర్గం మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇరువర్గాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రవిందర్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన మరికొందరు తనపై దాడికి యత్నించారని ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పీలపై వైద్యాధికారుల వేధింపులు ఆపాలి

● డీఎంహెచ్‌వోకు ఏఐటీయూసీ వినతి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో పనిచేస్తున్న మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)లపై జిల్లా వైద్యాధికారుల వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీ సమస్యలపై గురువారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వీడియోకాల్ అటెండెన్స్ విధానంలో పలు సవరణలు చేయాలని, ప్రతినెల రూ.41 వేల వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు వినియోగించుకోవాలి: ఆర్‌ఎం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత సూచించారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో మెదక్ రీజియన్ నుంచి టాప్-త్రీ ఏజెంట్స్, టాప్-త్రీ కస్టమర్లను ఆమె సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం కార్గో ఇన్‌చార్జి ఇసాక్, ఏజెంట్లు పాల్గొన్నారు.


సంగారెడ్డిలో ఏజెంట్‌ను సన్మానిస్తున్న ఆర్‌ఎం ప్రభులత

అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలి

● మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, సెప్టెంబరు 26: మండలంలోని ఆదర్శ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు స్థానిక అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్, మంతూరు యూపీఎస్, కాజీపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల ప్రగతిని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను వారంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గౌరిశంకర్, సీసీ ప్రవీణ, సీలు మంగమహేశ్వరీ, జ్యోతి, స్వప్న తదితరులు ఉన్నారు.

'ఆలయాల పరిరక్షణకు కమిటీలు వేయాలి'

కంగ్టి, సెప్టెంబరు 26: హిందూ ఆలయాల పరిరక్షణకు సాధుసంతులు, హిందూ ధర్మ పరిరక్షకులతో కమిటీలు వేయాలని డిమాండ్ చేస్తూ గురువారం హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ విష్ణుసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. గోహత్యలపై కఠిన చర్యలు అమలు చేయాలన్నారు. ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను అరికట్టాలన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిరాం, దత్తాత్రి, పండరి, రాజు, గోపాల్‌రెడ్డి, అంజన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో, కార్యదర్శుల సస్పెన్షన్ అమానుషం..!

అల్లాదుర్గం, సెప్టెంబరు 26: ఎంపీడీవో, కార్యదర్శుల సస్పెన్షన్ అమానుషమని, నల్లగొండ కలెక్టర్ అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండల పరిషత్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో నిధులు లేకపోయినా సమస్యల పరిష్కారం కోసం నిధులతో కూడిన పనులు చేయాలంటూ కలెక్టర్ ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యదర్శులను సస్పెన్షన్ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్ శంకర్ యాదవ్, కార్యదర్శులు లింగప్ప, ప్రభాకర్, ఉదయ్, ఖయ్యూం, తుక్కారాం, అనిత, మండల పరిషత్ సిబ్బంది సజ్జత్ అలీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలి

● చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సుదర్శన్‌రెడ్డికి ఉపాధ్యాయుల వినతి

వెల్దుర్తి, సెప్టెంబరు 26: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్టీటీయూ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం కోరారు. గురువారం రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సుదర్శన్‌రెడ్డికి ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. అలాగే జీవో 25ను సవరించాలని, సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్టీటీయూ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం, విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డిలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరామ్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'అర్హులైన విశ్రాంత ఉద్యోగులకు రుణాలు'

నారాయణఖేడ్, సెప్టెంబరు 26: అర్హులైన విశ్రాంత ఉద్యోగులకు అర్హతను బట్టి వివిధ రుణాలను అందించడానికి కృషిచేస్తామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సూర్యప్రకాష్ అన్నారు. గురువారం ఖేడ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో డివిజన్ స్థాయి విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలన బకాయిలను సకాలంలో చెల్లిస్తే మరింతమందికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ మురళీకృష్ణ, విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు నర్సింహులు, వెంకటేశం పాల్గొన్నారు.

సంగారెడ్డి ఎంఈవోగా విద్యాసాగర్ బాధ్యతలు స్వీకరణ

సంగారెడ్డి అర్బన్/ సెప్టెంబరు 26: సంగారెడ్డి మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా ఎ.విద్యాసాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ బడుల్లో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తానన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈవో విద్యాసాగర్‌ను కార్యాలయ సిబ్బంది, సీఆర్‌పీలు శాలువాతో సన్మానించారు. అలాగే వట్‌పల్లి మండల ఎంఈవోగా గోవింద్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.


సంగారెడ్డి ఎంఈవోను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది, సీఆర్‌పీలు

బురదలోనే రాకపోకలు



సదాశివపేట పట్టణంలో 65వ నంబరు జాతీయ రహదారి పక్కన సమీకృత మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన దారి బురదమయంగా మారింది. ఇక్కడి నుంచే మైనార్టీ గురుకుల హాస్టల్, వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రధాన కార్యాలయం, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పాల శీతలీకరణ కేంద్రం, ఐకేసీ, సీడీపీవో కార్యాలయాలు, ఆధార్‌సెంటర్లకు వెళ్తారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చి బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

- సదాశివ పేట